# వైద్యులు త్యాగభావంతో బీదలకు సేవలందించాలి

ఖండఖండాంతర ఖ్యాతి నార్జించిన
మహనీయులను గన్న మాతృభూమి
పాశ్చాత్య వీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమును గన్న సమరభూమి
పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ చూపించిన భరతభూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
ధీశక్తి చూపిన దివ్యభూమి

చిత్రకళలతోడ చిత్రమైయున్నట్టి
భరతభూమియందు జననమంది
భరతమాత ధర్మ భాగ్యంబు కాపాడ
బాధ్యతంత మీదె భక్తులార!

దివ్యాత్మస్వరూపులారా! జీవితంలో ఆరోగ్యమే మహాభాగ్యం. మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏ పనైనా చేయగలడు. ఎంతటి ధనమున్నా, ఎంతటి గుణమున్నా ఆరోగ్యం లేకపోతే ప్రయోజనం లేదు. కనుకనే ఆరోగ్య పరిరక్షణ అన్న అంశంపై ప్రాచీన కాలమునుండి భారతదేశమందున్న మహనీయులు, యోగులు, మేధావులు అనేక పరిశోధనలు చేస్తూవచ్చారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడి, ఆనందాన్ని చేకూర్చి, ప్రపంచానికి శాంతిభద్రతల నందించాలనే ఉద్దేశ్యంతో అనేకమంది ఋషులుకూడా తమవంతు కృషి సల్పారు. ఈనాడు మానవునికి అలోపతి (ఇంగ్లీషు వైద్యము) చాలా అవసరమని కొందరు భావిస్తున్నారు. మరికొందరు అలోపతి మాత్రమే కాకుండా ఆయుర్వేదముకూడా అత్యవసరమని విశ్వసిస్తున్నారు. అయితే, అలోపతి రోగమును తాత్కాలికముగా నివారిస్తుందేగాని, శాశ్వతంగా నివారణ గావించలేదు. ఆయుర్వేదమునకు మాత్రం రోగమును శాశ్వతంగా నివారణ చేయగల శక్తి ఉన్నది.

sri sathyasai vachanamrutam

## భగవత్ శక్తియే ఆధారం

మన దేహంలో గుండె చాలా ప్రధానమైనది. గుండె సమ్మె చేస్తే దేహం నిర్జీవమైపోతుంది. అయితే, గుండె చేసే పని ఏమిటి? రక్తమును ఊపిరితిత్తులకు పంపు కొట్టి, అక్కడ దానిని పరిశుద్ధపరచి దేహంలోని సర్వాంగములకూ సరఫరా చేస్తుంది. అంతేకాదు, గుండె ఒక్కతూరి పంపు కొడితే ఆ రక్తం దేహంలో 12 వేల మైళ్ళదూరం ప్రయాణం చేస్తుంది. ఇంతటి ఘనమైన శక్తిని గుండెకు ప్రసాదించినవారెవరు? సైంటిస్టులా? ఇంజనీర్లా? మానవమాత్రు లెవ్వరూ కాదు. ఏ యంత్రముగాని, తంత్రముగాని ఈ పని చేయలేదు. దీనికి భగవత్ శక్తియే ఆధారం.

భగవత్సంకల్పమే లేక మానవుడు ఏ చిన్న కార్యమునూ చేయలేడు. కాని, ఈనాటి మానవునికి దైవశక్తిపైన నమ్మకం లేదు. ఆత్మవిశ్వాసమును కోల్పోతున్నాడు. అందువల్లనే, ఎన్ని విధములైన అలోపతి మందులు అభివృద్ధి అయినప్పటికీ వాటితోపాటు రోగములు కూడా పెరిగిపోతున్నాయి. మానవుడు ప్రధానంగా ఆత్మవిశ్వాసమును అభివృద్ధి పరచుకోవాలి. ఆత్మవిశ్వాసం లేకుండిన మానవత్వమే వ్యర్థం.

## మందులతోపాటు దైవానుగ్రహంకూడా ఉండాలి

కేవలం మందులచేతనే వ్యాధులు నయంకాగలవని మీరను కుంటున్నారు. అలాగైతే, ఎంత మంది రాజులు, శ్రీమంతులు పోలేదు. వారిని మందులేమైనా కాపాడగల్గినాయా? కనుక, రోగాలు కేవలం మందులతో నయమయ్యేవి కావు, దైవానుగ్రహంకూడా అత్యవసరం. మందులు నెగెటివ్, దైవానుగ్రహం పాజిటివ్. ఈ రెండూ చేరినప్పుడే రోగనివారణ కాగలదు. కాబట్టి, మందుల వాడకంతోపాటు దైవానుగ్రహంకోసం ప్రార్థించాలి. దైవానుగ్రహం లేకపోతే దేహం క్షణమైనా నిలువజాలదు. నాడిని ఎవరు ఆడిస్తున్నారు? గుండెను నిర్విరామంగా ఎవరు పనిచేయిస్తున్నారు? దేహంలో రక్తాన్ని ఎవరు ప్రవహింపజేస్తున్నారు? అంతా దైవలీలయే. దైవశక్తిచేతనే దేహం పెరుగుతున్నది. కాబట్టి, దేహాన్ని సేవలో ప్రవేశపెట్టాలి. ముఖ్యంగా బీదలను సేవించటం చాలా అవసరం. మీ కడుపునిండుగా మీరు అన్నం తింటున్నారు. కాని, మిగిలినవారి గతి ఏమిటి? దానినికూడా మీరు దృష్టిలో పెట్టుకొని పరోపకార సంబంధమైన కార్యములలో ప్రవేశించాలి.

sri sathyasai vachanamrutam

## బీదలకు సేవ చేయటమే నా ప్రధాన లక్ష్యం

ఈనాడు గుండె జబ్బులు అధికమౌతున్నాయి. కనుకనే, ప్రశాంతి నిలయంలో ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నెలకొల్పి, అక్కడ అనేక మంది రోగులకు గుండె ఆపరేషన్లు చేయటం జరుగుతోంది. ఈనాటివరకు కొన్ని వేల ఆపరేషన్లు నిర్వహింపబడినాయి. తద్వారా ఎంతోమంది బీదలకు ఉపకారం జరిగింది. బయటి ఆసుపత్రులలో గుండె ఆపరేషన్ చేయించుకోవాలంటే చాలా డబ్బు అవసరం. కేవలం పరీక్షలు చేయించుకోవాలంటేనే ఎన్నో వేల రూపాయలు ఖర్చవుతుంది. పాపం, బీదవారికి అంత డబ్బు ఎక్కడి నుండి వస్తుంది? బీదల గతి ఏమిటి? బీదలను సంరక్షించి, వారి రోగాలను నివారణ గావించి దేశానికి ఆదర్శమును అందించాలి. బీదలను సంరక్షించటమే నిజమైన సేవ. కాని ఈనాడు గొప్పగొప్ప విద్యావంతులుగాని, శ్రీమంతులుగాని, డాక్టర్లుగాని, నాయకులుగాని, చివరికి ప్రభుత్వంకూడా బీదలను పట్టించుకోవటం లేదు. డాక్టర్లలో దయాదాక్షిణ్యాలు లోపించాయి. పదికోట్లు పెట్టి ఆసుపత్రిని కట్టిస్తే, నూరు కోట్ల ఆదాయాన్ని ఆశిస్తున్నారు. కనుకనే, బీదలు కష్టాలపాలవుతున్నారు. ఈనాడు విద్యావైద్య రంగాలలోనూ, సంగీత సాహిత్య రంగాలలోనూ ధనవ్యామోహం మితిమీరిపోయింది.

ప్రేమస్వరూపులైన వైద్యులారా! మీ మనస్సు మార్చుకొని, హృదయాన్ని దయతో నింపుకొని బీదలకు సేవచేయండి. ఆసుపత్రులను కడుతున్నారంటే, వాటి నుండి కోట్ల రూపాయలు ఆదాయం రావాలనే దురాశను విడనాడండి. ఎన్ని కోట్లు సంపాదించినా ఏమి ప్రయోజనం? మీరు పోయే సమయంలో డబ్బును మూటగట్టుకొని గొనిపోగల్గుతున్నారా? ఎంత సంపాదించినా అది మీ వెంట రాదు. కట్టకడపటికి వట్టి చేతులతోనే పోవాలి. కనుక, ప్రేమతో సేవ చేయండి. ముఖ్యంగా బీదలకు సేవ చేయండి. బీదల సేవయే దైవసేవ. అదే మిమ్మల్ని సంరక్షిస్తుంది. బీదల నిమిత్తమై మీ జీవితాన్ని అంకితం చేయండి. బీదలకు సేవ చేయటమే నా ప్రధాన లక్ష్యం. నాకు వేరొక ఆశయే లేదు. ఏమైనా సరే, ప్రాణాలనైనా త్యాగం చేసి బీదల సంక్షేమానికి కృషి చేస్తాం. మీరుకూడా ఇలాంటి లక్ష్యంతో సాయి చేస్తున్న పనులలో వేయింట ఒక భాగమైనా చేయండి. భగవంతుడు మీకు ప్రసాదించిన శక్తిని బీదలకు అర్పితం చేయండి.

srisathyasai vahini / vacharamrutam

లేకపోతే, మానవులుగా పుట్టి ప్రయోజనమేమిటి? తపస్సువలనగాని, తీర్థ యాత్రలవలనగాని, శాస్త్రశ్రవణంవలనగాని ముక్తి లభించదు. సంసార సాగరమును తరించాలంటే సేవ ఒక్కటే మార్గం.

## వైద్యులు త్యాగనిరతిని అలవరచుకోవాలి

ప్రేమస్వరూపులైన వైద్యులారా! మీ అదృష్టవశాత్తు మీరు గొప్ప చదువులు చదివి డాక్టర్లు అయినారు. డాక్టరుకు ఉండవలసిన ప్రధాన గుణం త్యాగమే. త్యాగగుణం లేని డాక్టరు ఉండి ప్రయోజనం లేదు. త్యాగమే జీవితానికి క్షేమమని గుర్తించాలి. బీదలను ఆప్యాయంగా చేరదీసి, వారికి సేవలందించాలి. అప్పుడే మీరు ధన్యులౌతారు. అనేకమంది బీదలు రోగనివారణ గావించుకోవటానికి తగిన ధనం తమవద్ద లేకపోవటంచేత ప్రాణాలు కోల్పోతున్నారు. మీరు ప్రేమతో అలాంటివారి ప్రాణాలను కాపాడండి. Help Ever, Hurt Never. బీదలను డబ్బుకోసం పీడించి వారి ప్రాణాలను తీయకండి. వారిని ఏడిపించి మీరు ధనం సంపాదిస్తే అది మీకు మంచిది కాదు. ప్రేమస్వరూపులు కండి, దయాస్వరూపులు కండి, త్యాగస్వరూపులు కండి. త్యాగమే యోగాన్ని అందిస్తుంది.

మీరు త్యాగభావాన్ని ఎంత పెంచుకుంటే లోకం అంత అభివృద్ధి అవుతుంది. కాబట్టి, మీరు సంపాదించిన డబ్బును బీదలకోసం వినియోగించండి. పరోపకార దీక్షను పూనండి. ఈనాడు ఇక్కడీ ఆసుపత్రిని నిర్మించటంచేత ఎందరో ప్రజలు వచ్చి చుట్టూ భవనాలు కట్టుకుంటున్నారు. ఇంతకుపూర్వం ఇక్కడ భూమికి అంతగా విలువ లేదు. ఈ ఆసుపత్రి ఏర్పడిన తరువాత ఇక్కడ భూమి యొక్క వెల చాలా పెరిగిపోయింది. ఇంత లాభం పొందినవారు బీదలకోసం ఏమి చేస్తున్నారు. ఒక్క బీదవానిని సంతోషపెడితే మీకుకూడా ఎంతో ఆనందం లభిస్తుంది.

## సాయిసంస్థలన్నీ శాశ్వతమైనవి

గతించిన మాజీ ముఖ్యమంత్రి జె.హెచ్. పటేల్ ఈ హాస్పిటల్ నిర్మాణానికి ఎంతో సహాయం చేశాడు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఎస్.ఎమ్. కృష్ణ కూడా ఎంతో సహాయం చేస్తున్నాడు. కర్ణాటక ప్రజలెందరో దీనికోసం పాటుపడుతున్నారు. కాబట్టి, ఈ హాస్పిటల్ కర్ణాటక ప్రజలకు తగిన

sri sathyasai vachanamrutam

సేవలు చేసి, ఆనందమును అందించాలని నా ఆకాంక్ష. జబ్బులు బీదవారికిగాని, కోటీశ్వరులకుగాని ఎవరికైనా వస్తాయి. కాబట్టి, ఇక్కడ ఎవరికైనా సరే వైద్యము ఉచితం; రోగులకు నయాపైసా ఖర్చులేదు. ఇంతేకాదు వారికి భోజనంకూడా ఉచితంగా అందించబడుతుంది. వారికి ఎలాంటి ఇబ్బందీ కలుగకుండా రోగ నివారణ గావించి, వారిని సుఖంగా ఇంటికి చేర్చటమే మా లక్ష్యం. ఇది శాశ్వతంగా ఉండే సంస్థ. ఇదెంతో కాలం ఉండబోదని కొంతమంది భావిస్తున్నారు. ఇలా భావించటం చాలా పొరపాటు. సాయి నెలకొల్పే సంస్థలన్నీ శాశ్వతమైనవి.

ఈ హాస్పిటల్‌లో గడిచిన మూడు, నాల్గు దినములనుండి గుండె ఆపరేషన్లు జరుగుతున్నాయి. పేషంట్లలో అధికులు బీదవారు. ఒకరు Carpenter (వడ్రంగి), ఒకరు Dhobi (చాకలి). ఈ రీతిగా అనేకమంది బీదవారు ఈ హాస్పిటల్‌లో చేరి రోగనివారణ గావించుకుంటున్నారు. ఈ స్వల్పవ్యవధిలోనే 50 ఆపరేషన్లు జరిగినవి. ఆ పేషెంట్లు ఇప్పుడెంతో ఆనందంగా ఉన్నారు. వారి ముఖాలను చూసిన వారికి కూడా ఎంతో ఆనందం కల్గుతుంది. రోగులకు ఆరోగ్యానందములను చేకూర్చటమే మా ప్రధాన లక్ష్యం. ఈనాడు ఈ ఆసుపత్రిని బీదలకు అంకితం చేస్తున్నాము. బీదలను సంతోషపెట్టినప్పుడే నాకు సంతోషం కల్గుతుంది. నా జీవితమంతా బీదలకోసమే ధారపోస్తున్నాను. ముమ్ముందు ఈ ఆసుపత్రిలో గుండెమార్పిడి, ఊపిరితిత్తులమార్పిడివంటి అత్యంత ఆధునికమైన ఆపరేషన్లుకూడా నిర్వహింపబడతాయి. మొన్న గుల్బర్గాకు చెందిన ఒక చాకలి మనిషికి ఈ ఆసుపత్రిలో ఆపరేషన్ జరిగింది. "స్వామీ! మా పాలి దైవమా! మీ అనుగ్రహంతో నాకు గుండె ఆపరేషన్ జరిగింది, రోగనివారణ జరిగింది" అంటూ అతడు ఎంతో ఆనందించాడు.

**చెప్పవచ్చు కోటి, చెయ్యరు ఒక్కటీ!**

ఈ జగత్తులో ఎంతమంది ధనవంతులు లేరు! కాని, వారెవరైనా బీదలపట్ల కొంచెమైనా దయాదాక్షిణ్యాలు చూపుతున్నారా? "చెప్పవచ్చు కోటి, చెయ్యరు ఒక్కటీ!" సాయి చేస్తున్న సత్కార్యములలో వేయింట ఒక భాగమైనా ఏ శ్రీమంతుడైనా చేస్తున్నాడా? కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి మేము పల్లెలకు నీరందిస్తున్నాం; కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి విద్యను,



sri sathyasai vahini amrutam

వైద్యమును ఉచితంగా అందిస్తున్నాం. కాని, కొంతమంది అసూయతో దుష్ప్రచారానికి పాల్పడుతున్నారు. నాలుకకు ఎముక లేదు; ఏవిధంగానైనా మాట్లాడవచ్చు. అయితే, ఆ మాట్లాడే వ్యక్తిని వచ్చి బీదలకు కడుపు నిండా ఇంత అన్నం పెట్టమనండి, చూద్దాం.

## ఈ ఆసుపత్రి ముమ్ముందు గొప్ప స్థితిని పొందుతుంది

ఈ ఆసుపత్రి అందంగా ఉందని అందరూ కొనియాడుతున్నారు. కేవలం అందంగా ఉంటే ఏమి ప్రయోజనం? అందరికీ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని చేకూర్చాలి. బీదలు సంతోషపడినప్పుడే మనకు ఆనందం కల్గుతుంది. బీదలవద్ద మందులు కొనటానికి డబ్బు ఉండదు. కాబట్టి, వారికి కావలసిన మందులన్నీ మేమే ఉచితంగా ఇస్తాము. మీరు ఈ ఆసుపత్రిని తక్కువ అంచనా వేయకండి. ఈ ఆసుపత్రిని గురించి ఇప్పుడు మీకు అంతగా తెలియదు. ముమ్ముందు ఇది గొప్ప స్థితిని పొందుతుంది. వివిధ దేశాల ప్రజలు ఇక్కడికి వచ్చి చికిత్స చేయించుకుంటారు. అలాంటి దివ్యమైన శక్తి ఈ హాస్పిటల్‌లో ఉన్నది.

పూర్వం పుట్టపర్తిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కట్టినప్పుడు దానిని కొంతమంది తక్కువ అంచనా వేశారు. కాని, నేడు పుట్టపర్తి చుట్టుప్రక్కల గ్రామాలలో ఒక్క హార్ట్ పేషెంట్‌కూడా కనిపించడు. ఆ ఆసుపత్రిలో హార్ట్ ఆపరేషన్ చేయించుకోవాలంటే చిన్న పిల్లవాడుకూడా ఏమాత్రమూ భయం లేకుండా నవ్వుతూ వస్తాడు. అదేరీతిగా, ఈ కర్ణాటక రాష్ట్రంలోకూడా ఎవ్వరికీ గుండె జబ్బులు లేకుండా చేయాలి. రోగపీడితులైన పల్లె ప్రజలను తీసుకువచ్చి వారికి తగిన వైద్యం చేయించాలి. ఎవరినైనా తీసుకురండి. మాకు ఎట్టి అభ్యంతరమూ లేదు. ఈ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవటానికి అందరికీ సమాన హక్కుంది. ఏ కులంవారైనా, ఏ మతంవారైనా, ఏ దేశంవారైనా వచ్చి ఈ ఆసుపత్రిలో చికిత్స పొందవచ్చు. మాకు ఎలాంటి భేదమూ లేదు. అందరికీ ఉచితంగా ట్రీట్‌మెంట్ ఇస్తాం. అప్పులైనా చేసి ఉచిత వైద్య సేవలందిస్తాం. ధనంకోసం ఏమాత్రమూ వెనుకంజ వేయం, రోగనివారణ గావించి ప్రాణాలను కాపాడటమే మా ప్రధాన లక్ష్యం. మీరుకూడా ఈ ఆదర్శాన్ని అనుసరించండి. 'లోకాస్సమస్తాః సుఖినో భవంతు' అందరూ సుఖంగా ఉండాలి. నాయొక్క వాంఛ అదియే. దానినిమిత్తమై నేను ఏమైనా చేస్తాను, నా ప్రాణాన్నైనా అర్పితం చేస్తాను. ప్రజాక్షేమం కోరని వ్యక్తి ఉండి

sri sathyasai vachanamrutam

ప్రయోజన మేమిటి? నేనెప్పుడూ అందరి మంచినీ కోరతాను. మనం చేసే పని మంచిదైనప్పుడు, మన భావాలు మంచివైనప్పుడు డబ్బుకోసం వెఱువనక్కర్లేదు, దానంతటదే నడుచుకుంటూ వస్తుంది. ప్రేమస్వరూపులారా! ఈరోజు మేము మీకు చాలా ఇబ్బంది కల్గించాము. గత మూడు, నాల్గు గంటలుగా మీరు ఎంతో ఓపికతో కూర్చున్నారు. బాగా అలసిపోయారు. అయితే, ఇంత శ్రమకోర్చి ఈ సమావేశంలో పాల్గొన్నందుకు మీరు నేర్చుకోవలసింది ఒకటుంది. ఏమిటది? త్యాగ భావమును పెంచుకొని, పరోపకార సంబంధమైన కార్యములలో మీ ధనమును వినియోగించండి, బీదలకు సహాయం చేయండి. ఆకలి గొన్నవారికి అన్నం పెట్టండి. ఈనాడు కొంతమంది శ్రీమంతులు దుర్వ్యసనాలకు బానిసలై ఎంతో డబ్బును వ్యర్థం చేస్తున్నారు. ఆహారము, ధనము, శక్తి, కాలము – ఇవన్నీ భగవత్స్వరూపాలు. వీటిని వ్యర్థం చేయకూడదు. అనవసరమైన మాటలతో కాలాన్ని వ్యర్థం చేసే బదులు పరోపకార సంబంధమైన పనిలో పాల్గొనండి. మీ శక్తికొద్దీ అందరికీ సహాయం చేయండి. అదే నేను కోరేది.

ఈనాడు అన్ని వివరాలు చెప్పటానికి అంత వ్యవధి లేదు. మన వాజ్‌పేయి శ్రమ తీసికొని ఇక్కడికి వచ్చాడు. మంచిపనులకు తగిన ఉత్సాహ ప్రోత్సాహముల నందించే ఇలాంటి నాయకులు దేశానికి చాలా అవసరం. దేశం ఉద్ధరింపబడాలంటే నాయకులకు మంచి భావములు రావాలి. వారు దైవప్రీతిని పెంచుకోవాలి. దైవానుగ్రహాన్ని పొందాలి. దైవశక్తిచేత సాధించలేని పని ఈ జగత్తులో లేదు. ప్రేమస్వరూపులారా! మళ్ళీ కొన్ని దినముల తరువాత మీరిక్కడకు వచ్చి ఈ ఆసుపత్రి త్యాగభావంతో అందిస్తున్న సేవలను స్వయంగా చూసి ఆనందించండి. ఎక్కడా లభించని ఆనందమును మీరిక్కడ అందుకోగలరు. బీదలు ఆరోగ్యంతో, ఆనందంతో కళకళలాడుతూ కిలకిల నవ్వుతుంటారు. బీదల ఆరోగ్యాన్ని మనం కాపాడాలి. బీదల ఆనందాన్ని మనం చూడాలి. అదే మన జీవితానికి సరియైన మార్గము. "పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం." కాబట్టి, బీదల ఆనందాన్ని చూసే ప్రాప్తికి మీరు నోచుకోవాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తున్నాను.

(తేది : 19-01-2001 సాయంత్రం వైట్ ఫీల్డ్‌లోని శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ సందర్భంగా శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)



srisathyasaivachanamrutam